## క్లుప్తంగా

### సనాతన ధర్మం గొప్పది



ప్రసంగిస్తున్న శ్రీకృష్ణ చైతన్య స్వామి

సారవకోట: సనాతన ధర్మం గొప్పదని, దీనిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని శ్రీకృష్ణ చైతన్య స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని కిన్నెరవాడ గ్రామంలోని గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సిద్దయ్య స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. అత్యంత పురాతనమైన హిందూ ధర్మం ఎంతో గొప్పదని శ్రీకృష్ణ చైతన్య స్వామి అన్నారు. దత్తాత్రేయ స్వామి జననం గూర్చి వివరించారు. అల్లు రామయ్య, బోయిన వెంకటరమణ, గొలివి మోహన్‌రావు, రామదాసు, తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

### భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి



భజన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో స్వామి వారి జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అర్ధ అఖండ భజన కార్యక్రమం చేపట్టారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

### నిమ్మతొర్లవాడ రైతుకు సన్మానం



రైతు చిరంజీవిని సన్మానిస్తున్న అధికారులు

ఆమదాలవలస: విశాఖపట్నంలో జరుగుతున్న ఆర్గానిక్ మేళాలో ఆమదాలవలస మండలం నిమ్మతొర్లవాడ గ్రామానికి చెందిన నక్క చిరంజీవికి రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతు అవార్డ్‌తో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల నుంచి ప్రకృతి వ్యవసాయంలో చెరుకు, వరి పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతిలో అనేక వనరులు సహజంగానే లభిస్తున్నందున అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సూచనలిస్తున్న డీపీఎం రేవతికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతు సాధికార సంస్థ అధికారులు, మార్కెటింగ్ ఎస్.ఎఫ్.ఎ శివాజీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు



ప్రత్యేకంగా అలంకరణలో మూలవిరాట్

సారవకోట: మండలంలోని చీడిపూడి కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. సోమవారం నుంచి నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, దీంట్లో భాగంగా తులసీ దళార్చన, ఎర్ర కలువలతో లక్ష్మి హోమం, విశేష పుష్పాభిషేకం, తిరుప్పావడ సేవ, నవనీత సేవ, కుడారై మహా ప్రసాద నివేదన, క్షీరాభిషేకం, వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి గరుడ వాహనంపై తిరువీధి, గోదారంగనాథ స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఆలయాన్ని, మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



హర్షిత

నరసన్నపేట: షిర్డీలో గల సాయినాథుని సన్నిధిలో శనివారం రాత్రి మండలంలోని ముద్దాడపేటకు చెందిన 8 ఏళ్ల ధర్మాన హర్షిత కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి అందరినీ ఆకట్టుకుంది. హర్షిత నృత్య ప్రదర్శనను చూసి నిర్వాహకులు అభినందించారని తల్లిదండ్రులు శేఖరరావు, సాయిరేష్మ ఆదివారం తెలిపారు. మూడో తరగతి చదువుతున్న హర్షిత కూచిపూడి నృత్య ప్రదర్శనలో శిక్షణ తీసుకుందన్నారు. హర్షితను గ్రామస్తులు అభినందించారు.

# పురుషోత్తపురం ఆధ్యాత్మిక క్షేత్రం



సూర్యనారాయణస్వామి ఆలయం



కోదండరామస్వామి ఆలయం



శివాలయం

- సర్వదేవుళ్లకు నిలయం
- ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు

సరుబుజ్జిలి: సర్వదేవుళ్ల ఒకేచోట కొలువైతే ఆ ప్రాంతం ఆధ్యాత్మిక ప్రదేశంగా విరాజిల్లుతోంది. నిత్యం దైవనామ స్మరణలు, మంగళ వాయిద్యాలు, హోమాలు, అర్చనలు, వేదపండితులతో గ్రామమంతా పుణ్యక్షేత్ర వాతావరణం నెలకొంటుంది. దీంతో గ్రామస్తుల్లో భక్తిభావం పరిఢవిల్లి అభివృద్ధికి నాందిపడుతోంది. వీటన్నింటికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న గ్రామం సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం. సుమారు నాలుగు వేల జనాభా కలిగిన గ్రామంలో ఆధ్యాత్మిక భావనతో గల భక్తులు అధికంగా ఉండడమేకాకుండా, ఆమదాలవలస నియోజకవర్గంలో రాజకీయంగా కీలక భూమిక పోషించిన నేతలకు కొదవలేదు.

**దేవాలయాలకు పెట్టింది పేరు..**

పురుషోత్తపురం గ్రామానికి ప్రారంభంలోనే నిర్మించిన సూర్యనారాయణస్వామి ఆలయం భక్తుల తాకిడితో రెండో అరసవల్లిగా వర్ధిల్లుతోంది. రథసప్తమి రోజున రద్దీగా ఉంటుంది. వెంకటేశ్వర స్వామి, రంగనాథస్వామి, కోదండరామస్వామి, వీరవెంకటసత్యనారాయణ, సుబ్రహ్మణ్యస్వామి, నవదుర్గ, అయ్యప్ప, ఉమాకామేశ్వరస్వామి, అభయాంజనేయ, షిర్డీసాయినాథ, త్రినాథస్వామి, సంతోషిమాత ఆలయాలున్నాయి. ధనుర్మాసంలో భక్తుల రాక అధికంగా ఉంటుంది. తిరుప్పావై ప్రవచనాలు ప్రతీరోజు నిర్వహిస్తారు.

### ఆధ్యాత్మికత వృద్ధి



భక్తిభావన వృద్ధి చెందాలంటే ప్రజలంతా నిత్య జీవితంలో కొంతభాగం ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించాలి. అయ్యప్ప సహిత వీరవెంకటసత్యనారాయణస్వామి ఆలయంలో నిత్యపారాయణ జరుపుతూనే ఉంటాం. దీనివలన లోకశాంతి కలుగుతుంది.

– ఆరవెల్లి భాస్కరశర్మ, రాజేశ్వరిపీఠం వ్యవస్థాపకుడు, పురుషోత్తపురం

### గ్రామానికి ప్రత్యేకత ఉంది



రథసప్తమి రోజున దేవాలయంలో సూర్యనమస్కారాలు, జపాలు చేస్తుంటాం, ప్రతీరోజు క్షీరాభిషేకాలు, అర్చనలు చేస్తాం. స్వామివారి దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి రాజకీయ నేతలు, వ్యాపారులు, ఉద్యోగులు అధికంగా తరలివస్తారు. దీనిలో భాగంగా అన్ని దేవాలయాల దర్శనభాగ్యం భక్తులకు కలుగుతుంది.

– బంకుపల్లి గోపాలశర్మ, సూర్యనారాయణ స్వామి ఆలయ అర్చకులు, పురుషోత్తపురం



కోదండరామస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



సూర్యనారాయణస్వామికి క్షీరాభిషకం చేస్తున్న అర్చకుడు



షిర్డీ సాయినాథునికి పూజలు చేస్తున్న అర్చకుడు

## అమరజీవి త్యాగం మరువలేనిది



నరసన్నపేట: అమరజీవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ప్రాణత్యాగాన్ని చేశారని వక్తలు అన్నారు. శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేశారని కొనియాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: అవరజీవి చిత్రపటానికి పూలమాలవేస్తున్న అమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్



పాతపట్నం: మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు




ఆమదాలవలస: కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణంలోని అమరజీవి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ



సారవకోట: శాఖా గ్రంథాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

### మహనీయుడిని మరిచిన కూటమి నేతలు!



వెలవెలబోతున్న పొట్టి శ్రీరాములు విగ్రహం

ఆమదాలవలస: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు ఆమదాలవలస నియోజకవర్గ కూటమి నేతలకు గుర్తుకు రాలేదు. ఆమదాలవలస పట్టణంలోని రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహం ఆయన వర్ధంతి రోజున వెలవెలబోయింది. ఈ విగ్రహం పక్కనుంచే ఎమ్మెల్యే కూన రవికుమార్ పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో ఆదివారం ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి మాత్రం ఆయనకు, కూటమి నాయకులకు గుర్తుకురాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### లీజు రద్దు చేయాలని డిమాండ్



సంతకాలు సేకరిస్తున్న ప్రసాదరావు, తదితరులు

కొత్తూరు: మండలంలోని నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వం ఇచ్చిన లీజ్‌ను వెంటనే రద్దుచేయాలని, లేకపోతే ఆందోళనకు దిగుతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు అన్నారు. కాంప్లెక్స్ లీజును రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ప్రజలు, ప్రయాణికుల నుంచి సంతకాలు సేకరణ చేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ ప్రయాణికులకు ఎంతగానే ఉపయోగపడుతున్న కాంప్లెక్స్‌ను లీజుకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ప్రతీరోజు పదుల సంఖ్యలో బస్సులు రాకపోకులు సాగిస్తున్నాయన్నారు. ఆలివెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, బి.సత్యాలు, రాజు, అప్పలరావు, అక్కులు, తదితరులు పాల్గొన్నారు.

### పోటీ పరీక్షల్లో సత్తాచాటాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: విద్యార్థులు పోటీ పరీక్షల్లో సత్తాచాటాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అజాద్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రొంపివలస హైస్కూల్‌కు చెందిన పి.ధనుష్, డి.మనోహర్, తృతీయ స్థానంలో కొమ్మువలస హైస్కూల్‌కు చెందిన పి.కార్తీక్ నిలిచారు. కన్సోలేషన్ బహుమతులు ఇద్దరికి అందజేశారు. ప్రథమ బహుమతి రూ.5,555, ద్వితీయ బహుమతి రూ.3,333, తృతీయ బహుమతి రూ.2,222, కన్సోలేషన్ బహుమతి రూ.1,000, సర్టిఫికెట్లు, మెమోంటోలను ఎమ్మెల్యే అందజేశామన్నారు. హెచ్ఎం బి.రామ్మూర్తి, ఉపాధ్యాయుడు ఆజాద్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### 17న జాతీయ పెన్షనర్స్ డే

నరసన్నపేట: ఈ నెల 17న స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు సదాశివుని ప్రభాకరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల కల్లా నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లకు సత్కారం చేయనున్నామన్నారు.

### ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక



వంశీ

నరసన్నపేట: మండలంలోని ముద్దాడపేటకు చెందిన ముద్దాడ వంశీ ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. శుక్రవారం రాత్రి విడుదలైన ఎస్ఎస్‌సీ, సీఆర్‌పీఎఫ్ ఫలితాల్లో ఉద్యోగాలు పొందాడు. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా, సీఆర్పీఎఫ్ ట్రేడ్ మేన్‌గా సెలెక్ట్ అయ్యాడు. మొదటి ప్రయత్నంలోనే రెండు పోస్టులు సాధించాడని తల్లితండ్రులు ముద్దాడ తాతారావు, అప్పమ్మ తెలిపారు. వంశీని గ్రామస్తులు అభినందించారు.

### పశువుల అక్రమ రవాణా అడ్డగింత



వ్యాన్‌లో ఉన్న పశువులు

జలుమూరు: పశువులు అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.అశోక్ బాబు తెలిపారు. కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంత నుంచి ఆదివారం వ్యాన్‌లో పశువులు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తిలారు జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. నాలుగు ఆవులు, నాలుగు ఎద్దులు ఉన్నాయన్నారు. వీటిని రణస్థలం గోశాలకు తరలించామన్నారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

### విద్యార్థి దశ ఎంతో కీలకం

పాతపట్నం: విద్యార్థుల్లో మార్పులు తీసుకురావాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు మహేంద్ర గోపీనాథ్, కె.మాధవీరామచంద్రుడు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలమన్నారు. ఈ కార్యక్రమాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు, తూలుగు తిరుపతిరావు, ప్రిన్సిపాల్ అంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



నరసన్నపేట మండలం మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాలరాతితో తీర్చిదిద్దిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి ధర్మాన సూర్యనారాయణ (కిల్లాం గ్రామం) దంపతులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్కూల్ అభివృద్ధికి తనవంతు సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సూర్యనారాయణ ప్రకటించారు. విద్యార్థి దశలో ఎందరినో ఉన్నతంగా తీర్చిదిద్దిన మాకివలస స్కూల్‌ను జీవితాంతం గుర్తుపెట్టుకుంటామన్నారు. పూర్వవిద్యార్థులు యాళ్ల వేణుగోపాలరావు, శిమ్మ చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

### ప్రమాకదర మలుపు



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం షళంత్రి జంక్షన్‌కు సమీపంలోని అలికాం–బత్తిలి రోడ్డులోని మలుపు. ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎటువంటి రహదారి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. సుదూర ప్రాంతాల నుంచి వాహనాలతో వచ్చేవారికి అవగాహన లేకపోవడం వలన ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

### ఆదమరిస్తే..



మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామంలోని ముఖ్య కూడలిలోని డ్రైనేజీ మూత విరిగి గుంతగా ఏర్పడి ప్రమాద స్థితిలో ఉంది. గొప్పిలి నుంచి పలాస వెళ్లే ముఖ్య రహదారి ఇది. నిత్యం రద్దీగా ఉండే రహదారి మధ్యలో డ్రైనేజీ మూత విరిగినా పట్టించుకునేవారు లేరు. వాహనాలను ఏమరపాటుతో నడిపితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ మూతను బాగుచేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి

### అలంకారప్రాయం



నరసన్నపేట మండలం యారబాడు స్కూల్ సమీపంలోని కాలనీ వద్ద నిర్మించిన 30 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత నీటి ట్యాంక్ అలంకార ప్రాయంగా మారింది. ఉకలాం నుంచి తాగు నీటిని యారబాడు ప్రజలకు అందించేందుకు నాలుగేళ్ల క్రితం ట్యాంక్ నిర్మించారు. ఇప్పటికీ దీనికి కనెక్షన్ ఇవ్వలేదు. పేరుకే నీటి ట్యాంక్ ఉన్నా తాగునీటికి మాత్రం గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రానున్న వేసవి కల్లా చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

### నేటి నుంచి సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

కొత్తూరు: ఈ నెల 16 నుంచి 19 తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధిపై మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామని ఈఓపీఆర్డీ వసంతకుమారి ఆదివారం తెలిపారు. 16, 17 తేదీల్లో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు. 18, 19వ తేదీల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, జూనియర్ లైన్‌మన్లు, హార్టీకల్చర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.